బొమ్మ: ఎస్.శంకర నారాయణ
సెల్: 09840372415

నూరేళ్ళ తెలుగు కథకు
నవ్య నీరాజనం - 31
నూరేళ్ళ తెలుగు కథకు





# నాన్నకు తోటపని అంటే కథలంత ఇష్టం

**- శాంతాసుందరి**

తెలుగు సాహిత్యంలో కథ అనగానే ముందుగా గుర్తుకు వచ్చేది కొడవటిగంటి కుటుంబరావుగారు. కమ్యూనిజాన్ని ఒంటబట్టించుకున్న కొకు వందలాది కథలు, వ్యాసాలు, నవలలు రాశారు. ఆయన కథా వస్తువులన్నీ దాదాపు మధ్యతరగతి జీవితాలే! కథలో క్లుప్తత, సంభాషణల్లో పదును ఆయన ప్రత్యేకత. కొకు మరణించి దాదాపు మూడు దశాబ్దాలైనా ఇప్పటికీ ఆయన కథలు నిత్యనూతనంగానే ఉన్నాయి. ఆయన అభిమానులు ప్రపంచ వ్యాప్తంగా శతజయంతి ఉత్సవాలు జరుపుకుంటున్నారు. తండ్రికి తగ్గ కూతురు ఆర్.శాంతాసుందరిగారు. ఆమె ఎక్కువగా అనువాద రచనలు చేస్తున్నారు. నవంబర్ 28న కొకు శత జయంతి సందర్భంగా, తండ్రి జ్ఞాపకాలను ఆమె నవ్య పాఠకులతో పంచుకున్నారు.

## కొత్తవాళ్లంటే భయం

మీకు తెలుసుగా.. నేను, మా నాన్నకు రెండో భార్య పిల్లను. నాకు ఇద్దరు తమ్ముళ్లు. ఒకరు పోయారు. ఇంకో తమ్ముడు కొడవటిగంటి రోహిణీ ప్రసాద్ అమెరికాలో ఉంటున్నాడు. నాకు చిన్నప్పుడు కొత్త వాళ్లను చూస్తే భయం. ఎవరైనా కొత్తవాళ్లు మా ఇంటికి వచ్చారంటే వారి దగ్గరకు పోయే దాన్ని కాదు. నాకు నెలల వయసు ఉన్నప్పుడు కూడా, ఎవరైనా నన్ను కొత్త వాళ్లు ఎత్తుకుంటే గట్టిగా ఏడ్చేదాన్నంట. చంపేస్తారేమో అనే భయం ఉండే దట నా కళ్లలో. ఈ విషయం మా అమ్మ చెప్పింది. మా నాన్నగారు కూడా ఉద్యోగరీత్యా బయట ఉండేవారు. అందువలన ఆయన కూడా నాకు కొత్తే! ఇంటికి వచ్చాడంటే భయంతో ఆయన వద్దకు పోయేదాన్ని కాదు. అమ్మ నాకు ఇంట్లో ఉన్న నాన్న ఫొటో చూపించి 'అడుగో నాన్న..ఆయనే ఈయన' అని చెప్పేది. అలా నాన్నంటే భయం పోయింది.

## నాన్నకు చాలా షార్ట్‌టెంపర్

మొదట్లో నాన్నంటే చాలా భయం. ఎందుకంటే ఆయనకు చాలా షార్ట్ టెంపర్. టక్కున కోపం వచ్చేస్తుంది. అంతే తొందరగా కోపం పోతుంది. నాన్న ఇంట్లో ఉన్నారంటే దాదాపుగా రాసుకుంటూ ఉంటారు. సాయంకాలాలు మాతో గడిపేవారు. మామూలు కథల్లాంటివి మాకు చెప్పేవారు కాదు. జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించిన విషయాలు ఎక్కువగా చెప్పేవారు. 1961లో అనుకుంటాను.., రష్యన్స్ 'స్పుత్నిక్'ను అంతరిక్షంలోకి ప్రవేశ పెట్టారు. ఆఫీసునుంచి నాన్న ఇంటికి వస్తూ వస్తూ భూతద్దాలు, గొట్టాలు, పేపర్లు తెచ్చే. వాటిని టెలిస్కోప్‌లాగా తయారు చేసి ఆకాశంకేసి చూసేవారు. మమ్మల్ని చూడమన్నా మాకయితే ఏమీ కనిపించలేదు. ఆయనకి కనిపించిందేమో! సైన్స్ పట్ల అంత ఆసక్తి ఆయనకు.

## ఆయనక్కావలసింది బుర్ర ఎదగడమే!

చదువు విషయంలో నాన్న మాకు పూర్తి స్వేచ్ఛనిచ్చారు. 'ఇది చదువు' అని ఎప్పుడూ చెప్పలేదు. మార్కుల గురించి ఆయన అస్సలు పట్టించుకునే వారు కాదు. బుర్ర ఎంత ఎదుగుతోంది అనేదే ఆయనకు కావలసింది. ఎప్పుడూ తిట్టటం కానీ, కొట్టటం కానీ చేయలేదు. అయితే ఎప్పుడయినా మేం చేయరాని పని చేస్తే అలా చేయరాదు అనే ధోరణిలో ఒక హింట్ ఇచ్చే వారు. అది మాకు అప్పట్లో అర్థమయ్యేది కాదు. నాకు పద్నాలుగేళ్ల వయసు వచ్చాక ఆ హింట్ వెనక అర్థం తెలిసింది. అంతవరకూ అన్నీ అమ్మే చూసుకునేది.

## నేర్చుకోవాలనే తపన ఎక్కువ

నాన్నది చాలా సింపుల్ నేచర్. చాలా అల్ప సంతోషి కూడా. చిన్నచిన్న వాటికే పొంగిపోయేవారు. అత్యాశలేదు. ఇక ఆయన డబ్బుకోసం అని ఎప్పుడూ రాయలేదు. ఏ పత్రిక వాళ్లడిగినా కథలు రాసి పంపించేవారు. నాన్నకు ఎంతసేపూ ఏదో ఒక కొత్త విషయం నేర్చుకోవాలనే తపన ఎక్కువగా ఉండేది. నాకూ అదే అబ్బింది. అమ్మ, నాన్న.. ఇద్దరూ ఏదో ఒకటి చదువుతూ ఉండేవారు. అమ్మ కూడా సాహిత్య వారసత్వం ఉన్న కుటుంబం నుంచే వచ్చింది. చలంగారు అమ్మకు పెదనాన్న.

## ఎప్పుడూ ఫ్లైట్ ఎక్కలేదు

నాన్న చాలా డిసిప్లిన్ వున్న మనిషి. అంతే సింపుల్‌గా కూడా ఉండే వారు. ఆయనకు బంగారంపట్ల, నగల పట్ల మోజు ఉండేది కాదు. ఎప్పుడూ కూడా బంగారు దుకాణాలకు వెళ్లేవాడు కాదు. నా పెండ్లికి నగలు కొనడానికి కూడా నాన్న బంగారు దుకాణానికి రాలేదు. అయితే ఆయన ఒకే ఒక్కసారి బంగారం దుకాణానికి వెళ్లారు. నాన్నకు, అమ్మకు పెళ్లయి పాతికేళ్లయిన సందర్భంగా డైమండ్ రింగ్ కొనుక్కొచ్చి అమ్మకు ఇచ్చారు. ఇక



భార్య వరూధునితో కొడవటిగంటి....

ఇంట్లోకి ఫ్రిజ్ తేవడం కూడా నాన్నకు ఇష్టం లేదు. అయినా తెచ్చాం. అయితే నాన్న ఫ్రిజ్‌లోని నీళ్లు తాగేవారు కాదు. ఫ్రిజ్‌లో పెట్టిన పెరుగు కూడా తినేవారు కాదు. అమెరికా వెళ్లే అవకాశం వచ్చినా ఆయన వెళ్లలేదు. తన జీవితకాలంలో ఫ్లైట్ ఎక్కలేదు.

## సాదా సీదాగా ఉండేవారు

నాన్నకు 'షో అప్' తెలీదు. అట్టహాసంగా ఉండే దుస్తులు వేసుకునే వారు కాదు. చాలా సాదాసీదాగా ఉండేవారు. 'నాకు తెలుసు. నేను చెప్తున్నాను. మీరు వినండి' అనే ధోరణిలో ఆయన రచనలు ఉండవు. ఆయనా అలా ఉండేవారు కాదు. ఒకసారి మా బంధువు ఒకరు అమెరికా వెళ్లారు. అక్కడినుంచి వచ్చేముందు ఫోన్ చేసి ''పెదనాన్నా..మీకోసం ఏం తెమ్మంటారు'' అనడిగారు. నాన్న తనకు బైనాక్యులర్ తెమ్మని చెప్పారు. అలా ఉంటాయి ఆయన కోరికలు.

## రంగస్థల పద్యాలు పాడేవారు

నాన్నగారికి ఫొటోగ్రఫీ, సంగీతం, తోటపని అంటే చాలా ఇష్టం. తనకు

హార్మోనియం వాయించడం వచ్చు. ఒక్కరే కూర్చుని హార్మోనియం వాయిస్తూ రంగస్థలం పాటలు పాడేవారు. నాకూ, మా తమ్ముడికి ఇద్దరు టీచర్లను పెట్టి సంగీతం నేర్పించారు. నాకేమో కర్ణాటక సంగీతం, మా తమ్ముడికి హిందుస్తానీ. రోజూ నాన్నతో పాటు తోటపనిలో నేనూ పాల్గొనే దాన్ని. పూలు పూసేది, కాయలు కాసేది చూడ్డం, చెట్లకు నీళ్లు పోయడం చాలా ఇష్టం.

## నాన్నకు సుండల్ అంటే ఇష్టం

నాన్న సినిమాలకు కూడా పని చేశారు. 'బోండాం పెళ్లి' అనే సినిమాలో వేషం కూడా వేసారు. నాకు ఐదేళ్ల వయసున్నప్పుడు ఒకసారి నాన్న కార్నివాల్‌లో పాల్గొన్నారు. అప్పుడు నాన్న పోలీస్ వేషం వేసారు. నేను నాన్నను గుర్తు పట్టలేక భయపడి ఏడ్చాను. నా ఏడ్పు చూసి నాన్న పోలీస్ వేషం తీసేసి వచ్చి నన్ను ఎత్తుకున్నారు. బీచ్‌కు రెగ్యులర్‌గా వెళ్లేవాడు. తనకు ఫొటోలు తీయడం చాలా సరదా. బీచ్‌లో అమ్మే సుండల్ అంటే చాలా ఇష్టం. నేను, నాన్న, తమ్ముడు తినేవాళ్లం. సుండల్ అమ్మే అతను చాలా మురిగ్గా ఉండేవాడు. అందుకని అమ్మ వాటిని తినేది కాదు.

## కోపం వస్తే ఉత్తరం రాసేసేవారు

టైమ్ వేస్ట్ చేయడం అమ్మకు, నాన్నకు అస్సలు ఇష్టముండదు. ఎప్పుడూ ఏదో ఒకటి రాసుకుంటూ, చదువుకుంటూ ఉండేవారు. నాన్న దగ్గరనుంచి టైమ్ మేనేజ్‌మెంట్ తెలుసుకున్నా. ఇంట్లో మా ముందు నాన్న ఎవ్వరి మీదా చెడు చెప్పేవారు కాదు. ఎవరిమీదయినా కోపం వస్తే ఉత్తరం రాసేసేవారు. దాన్ని మనసులో పెట్టుకుని గొడవ పడడం ఉండేది కాదు.

## ఆయన చైనాలో ఉన్నారో, రష్యాలో ఉన్నారో!

నాన్న 14 వేల పేజీలు రాశారు. తెలుగులో అన్ని వేల పేజీలు రాసిన మొదటి వ్యక్తి ఆయనే! ఆయన ఎప్పుడూ రీ రైట్ చేసేవారు కాదు. ఎక్కడా కొట్టివేతలు ఉండేవి కావు. అంటే నాన్నది అంత క్లారిటీ ఆఫ్ థింకింగ్ అన్నమాట! నాన్నలో ఇంకో మంచి విషయం ఉంది. ఉద్యోగం అయిపోయాక రోజూ అరగంటో, ముప్పావు గంటో మాతో స్పెండ్ చేసేవారు. మిగతా సమయాల్లో మాకు అందుబాటులో ఉండేవారు కాదు. అప్పుడు అమ్మ ''ఆయన ఎక్కడున్నారో చూడు. చైనాలోనో, రష్యాలోనో'' అనేది.


## నాన్న వద్దన్నా లిబియా వెళ్లాం

నాన్నగారు 1952నుంచి 'చందమామ' పత్రికలో పని చేశారు. అప్పటి నుంచి మా మకాం మద్రాసుకు మారింది. ఇక అప్పట్నించీ పెళ్లయ్యేదాకా నాన్నతోనే ఉన్నాను. ఇరవయ్యేళ్ల వయసులో నాకు జ్ఞానేశ్వరరావుగారితో పెళ్లయింది. పెళ్లయ్యాక ఇక ఆయనతోపాటు ఢిల్లీ వెళ్లిపోయాను.

1976లో మావారు డిప్యుటేషన్‌పైన లిబియా వెళ్లారు. వారితో పాటు నేనూ వెళ్లాను. అయితే నేను వెళ్లడం మా నాన్నగారికి ఇష్టం లేదు. వెళ్లొద్దని చెప్పారు. అయినా నేను బయల్దేరాను. అప్పటికే నాన్నగారికి హెల్త్ పాడయింది. నేను వెళుతుంటే మంచం దిగి గుమ్మం వద్దకు కూడా రాలేదు. మధ్యలో రెండుసార్లు వచ్చి వెళ్లాం. ఫైనల్‌గా 1980లో ఇండియాకు తిరిగి వచ్చాం. అక్కడ ఆగస్టు 16న బయల్దేరి ఇక్కడకు 17 చేరాలనుకున్నాం. మేము అనుకున్నట్టు రాలేకపోయాం. 23వ తేదీకి ఇక్కడకు వచ్చాం. ఎయిర్ పోర్ట్‌లో దిగగానే మా తమ్ముడ్ని ముందుగా అడిగిన ప్రశ్న 'నాన్నెలా ఉన్నాడు' అని. నాన్న చనిపోయాడని చెప్పాడు. చాలా బాధపడ్డాం. పైగా గిల్టీగా కూడా అన్పించింది. ఆంధ్రాకు వచ్చాక ఆనందం ఏంటంటే, కొకు గారి కూతుర్నని చెబితే చాలు అందరూ బాగా రిసీవ్ చేసుకున్నారు. అందునా నేను నాన్న పోలిక కదా!

## చనిపోవడానికి నాలుగ్గంటల ముందు వెదురు గింజలు నాటారు

ఒకసారి నాన్న ఎక్కడినుంచో కవర్లో వెదురు గింజలు తెప్పించుకున్నారు. ఆయన చనిపోడానికి నాలుగ్గంటల ముందు వాటిని తొట్టిలో నాటారు. ఆయన పోయాక అవి మొలకలు వచ్చాయి. వాటిని ఇంట్లో కాంపౌండ్ లోపల, మూలలో నాటింది అమ్మ. అవి బాగా పెరిగాయి. నాన్న అస్థికలు తెచ్చి వెదురు పొదల ముందు కుండీలో పెట్టాం. ఆ వెదుర్లు చాలా పెద్దవయ్యాయి. నాన్న పోయాక పదేళ్ళవరకూ ఆ ఇల్లు ఉండేది. యింట్లో మామిడి చెట్లు, జామ చెట్లు ఉండేవి. మేమంతా ఢిల్లీ వెళ్లిపోయాం. అమ్మ ఒక్కతే ఇంట్లో ఉండేది. రాత్రిళ్లు ఇంటిపైన రాళ్లు పడుతున్నాయని చెట్లు కొట్టించేసింది.



కొకుతో కూతురు, అల్లుడు...

## మమ్మల్ని ఫ్రెండ్స్‌లా చూసేవారు

నాన్న, అమ్మ మాతో చాలా అటాచ్డ్‌గా ఉండేవాళ్లు. ఇప్పటిలాగా కాదు. అప్పుడు ఎక్కడికి వెళ్లినా అందరం కలసి వెళ్లే వాళ్లం. నిజంగా టాలెంట్ ఉంటే సొంత పిల్లలయినా బాగా పొగిడేవారు. మమ్మల్ని ఫ్రెండ్స్‌లా చూసేవారు. నాన్న అప్పుడప్పుడు నాకు కలలోకి వస్తారు. ఆయన ఏదో అంటారు. కానీ గొంతు వినిపించదు. అయితే ఆయన చెప్పింది అర్థమవుతుంది. నేను జవాబు చెప్తాను.

–సుంకోజి దేవేంద్రాచారి

నాకు నచ్చిన మా నాన్న కథ

# కాలభైరవుడు

- కొడవటిగంటి కుటుంబరావు



**శ్రీనివాసరావు మాట నమ్మి స్కూలుకు సెలవుపెట్టి వెళ్ళలా వద్దా అని నేను చాలా సేపు మథనపడ్డాను. అసలే మా స్కూలు పరిస్థితులు అమిత దుర్భరంగా ఉన్నై. మాష్టర్లమందరమూ ఒక్కసారిగా ఎనిమిదిమంది కమిటీ మెంబర్లను తృప్తిపరచవలసి వచ్చేటప్పటికి మా తలప్రాణం తోకకు వస్తున్నది. ఏ క్షణాన ఏ మెంబరు ఏ పార్టీలో ఉంటాడో, ఎవరిచ్చిన సెలవు ఎవరు రద్దుచేస్తారో తెలియని స్థితిలో నేనుంటే మా శ్రీనివాసుడు, ''నీకు పునర్జన్మలో నమ్మకం ఉందా? ఉన్నా లేకపోయినా నీకు ఒక చిత్రం చూపిస్తాను. ఈ రహస్యం ఇంకా ఎవరికీ బయటపెట్టలేదు. నువ్వూ నేనూ కలిసి కొంత రహస్యశోధన చెయ్యటానికి ఇది మంచి అవకాశం. కాబట్టి ఈ ఉత్తరం అందినవెంటనే గురు శుక్రవారాలు శెలవు పెట్టి రా, సోమవారం దాకా ఉండవచ్చు. ఒక్కసారి ఈ రహస్యం నీ కళ్ళతో నువు చూశావంటే నీకే నమ్మకం కలుగుతుంది'' అంటూ రాస్తాడు. గురు శుక్రవారాలు మాత్రమే శలవు పెట్టానంటే శని ఆదివారాలు రెండు రోజులూ కమిటీ మెంబర్లు యావన్మందీ నాకోసం అర్జంటు పనిమీద మా యింటిచుట్టూ తిరిగిపోతారు! అది శ్రీనివాసుకేం తెలుసు? తీరాపోతే ఏమీ ఉండదేమో!**

కానీ బయలుదేరాను, నిరుత్సాహంతోనే. నేను మాష్టరునయి సిగిరెట్టు కాల్చటం మానుకొన్నప్పటి నుంచి నిరర్థకమ్మైన పనులు చెయ్యటమంటే నాకొక విధమ్మైన భయం పట్టుకుంది. ఏదైనా పని ఉంటేనే ఎక్కడికైనా వెళ్ళటమూ, అది కూడా ఎంతో ఆలోచించి మరీ వెళ్ళటమూ నాకు ఉద్యోగంలో కలిగిన కొత్త అలవాటు.

తీరా రైలెక్కిన తరవాత తట్టింది శ్రీనివాసరావుకు కొంచెం మతిభ్రమ ఏమయినా ప్రారంభమయిందేమోనని. ఆ అనుమానం ఇంటిదగ్గరే కలిగితే అసలు బయలుదేరకనే పోదును. శ్రీనివాసరావుకు మతిభ్రమ కలిగిందనుకోటానికి చాలా అవకాశం ఉంది – నాకు ఈ మాత్రం ఇంటిదగ్గిరే తట్టలేదు కానీ వాడు తండ్రి చచ్చిపోయిన అయిదు సంవత్సరాల కాలంలో జూదంలోనూ, గుర్రపు పందాల్లోనూ, స్నేహితుల మీదా, తాగుడుకూ, వేశ్యలకూ పాతిక వేలయినా తగలవేశాడు. వాణ్ణి చిన్నప్పటినించీ ఎరిగినవాళ్ళు కూడా వాడిట్లా అవుతాడని అనుకోలేదు. వాడి పరివర్తనలన్నీ దురూహ్యాలుగానే ఉంటూ ఉండేవి. ఇంకా ఒక కొంపా నాలుగెకరాల భూమీ ఉండగా శ్రీనివాసరావు మరొక పరివర్తనం కలిగి వెనకటి జీవితమంతా ఒక క్షణంలో చినిగిన చొక్కాను విసర్జించినట్టు విసర్జించి రైలుకు ఆమడ దూరాన ఆ బ్రాహ్మణకోడూరు గ్రామం చేరి వాడి స్వగృహంలో ఉంటూ సేద్యం ప్రారంభించాడు. అంతా సంతోషించాం అప్పట్లో. తీరా రైలెక్కిన క్షణాన నాకు సందేహం ప్రారంభమయింది – ఈ పల్లెటూరి జీవనమూ స్వయంకృషీ వాడి నెత్తి ఆడించిందేమోనని. ఒకటే చేతామనుకున్నాను; చెప్పిన ప్రకారం వాడు చుండూరు స్టేషను దగ్గిర నా కోసం హాజరుకాకపోతే నా తోవను నేను ఇంటికి తిరిగి వచ్చేద్దామనుకున్నాను. ఆ బండికి నన్ను రమ్మనీ తను నాకోసం కనిపెట్టుకుని స్టేషను దగ్గిర ఉంటాననీ రాశాడు స్పష్టంగా.

వాడెందుకు రాకుండా ఉంటాడు? ప్లాటుఫారం మీద వాణ్ణి కలుసుకుని వాడి వాలకం జాగ్రత్తగా గమనించాను. వాడి కళ్ళలో వెర్రిచూపు లేకపోలేదు. వాడి జుట్టు కూడా రేగి చిందరవందరగా ఉంది. అయినా తొందరపడ కూడదనుకున్నాను.

మా కోసం స్టేషను బయట గుర్రపు బండి సిద్ధంగా ఉంది.

"నేను నీ కోసం స్టేషనుకు రావటంలో ముఖ్యమైన ఉద్దేశం ఒకటి ఉంది. కాబట్టి నీ వెధవ పరధ్యానం మాని నే చెప్పేది జాగ్రత్తగా విను!" అన్నాడు శ్రీని వాసరావు, బండి సాగగానే. "ఒక మనిషి ఆరు నెలల కిందట చచ్చిపోయి మళ్ళా మూడు నెలల కిందట కుక్క అయి పుట్టాడు!" అని శ్రీనివాసరావు ఆగాడు.

నా అనుమానం దృఢమయింది. నేననుకున్నంతా అయింది కదా అనుకు న్నాను. ఈ పిచ్చివాడితో నేను ఆరు మైళ్ళు ప్రయాణం చెయ్యాలి. వాణ్ణి బండి వాడికీ నాకూ మధ్య కూర్చోబెట్టడం కూడా మంచిదే అయింది. ఈ రకం పిచ్చి ఆటే ప్రమాదకరముయినదని కాదు – ఏళ్ళ పర్యంతరమూ బయట పడకుండా మనిషిని లోలోపల తొలిచే ఉన్మాదం ఇది. చూశారో లేదో, పిచ్చివాణ్ణి రెచ్చగొ ట్టడం అమిత అపాయకరం. అందుకని నేను వాడు చెప్పినదానికల్లా ఊఁ కొట్ట సాగాను.

"భాగోతుల ఆదినారాయణశాస్త్రి ఉండేవాడు. ఎరుగుదువు కాదూ?" అన్నాడు శ్రీనివాసరావు. ఆ భాగోతుల పెద్దమనిషిని ఎవరో, నేను బుద్ధి తక్కు వగా స్కూలుకు శలవుపెట్టి బ్రాహ్మణకోడూరు అగ్రహారం వెళ్ళుతుండటానికీ ఆ పెద్ద మనిషికీ ఏమి సంబంధమో ఊహించలేకుండానే, 'అవును, అతని ప్పుడు కోడూరులో ఉంటున్నాడా?" అన్నాను.

నేనామాటలనగానే శ్రీనివాసరావులో కలిగిన వికారం వర్ణనాతీతం. వాడి కళ్ళు మరింత ఉన్మాదిగా మెరిసినై. వాడు లేవటానికి కూడా ప్రయత్నం చేశాడు. వాడి తలకు బండికప్పు తగిలింది. ఆ తరవాత వాడి ఉద్రేకం కొంచెం ఉపశమించింది. కానీ పూర్తిగా రహితం కాలేదు.

"చూశావా? ఇదే క్లేర్‌వాయన్సంటే!" అన్నాడు వాడు.

"ఏది?" అన్నాను బండిలోనించి బయటికి తొంగిచూసి.

"ఆదినారాయణ చచ్చిపోయి ఆరు నెల్లయింది. వాడిప్పుడు తిరిగి కుక్కగా పుట్టి మా యింట్లో ఉన్నాడు! వాణ్ణి చూపించటానికి నిన్ను తీసుకుపోతు న్నాను!"

వాణ్ణి ఈ స్థితిలో మీరు ఊహించుకోవాలే కాని నేను వర్ణించలేను. వాడి రేగిన జుట్టూ, పాలిపోయిన కోలమొహమూ, హాస్యంతో కాక కేవలం ఉద్రే కంతో నవ్వుతూ వణుకుతున్న వాడి పెదిమలూ, అన్నిటినీమించి వెర్రిచూపుతో నిండిన వాడి కళ్లూ – సముద్రానికి అవతలిమేర కనిపెట్టిన కొలంబసు ఇట్లాగే కనబడి ఉంటాడని ఊహించుకున్నాను. పరీక్ష పాసయిన విద్యార్థులూ, లాట రీలో డబ్బు సంపాదించిన దరిద్రులూ, ఎదయిన ఆవులూ మొదలైన వస్తువు లలో ఉండదగిన లక్షణాలు వాడిలో కనిపించినై. వాడికి పిచ్చిపట్టిందనుకో వటం నాదే పొరబాటు – వాడి మాదిరిగా ప్రవర్తించే పిచ్చివాళ్ళను నేనెక్కడా చూడలేదు.

"ఇది – ఈ కుక్క – ఆ ఆదినారాయణేనని నీకెట్లా తెలుసు" అన్నాను.

శ్రీనివాసరావు కొంచెం తికమక పడ్డాడు.

"అది నేను రుజువు చెయ్యలేను. కానీ ఈ కుక్క ఆదినారాయణేనని నాకు తెలుసును" అన్నాడు వాడు చివరకు.

"నీ నమ్మకానికైనా కారణం చెప్పు, ఏదో కారణం ఉండాలిగా?"

"చెబితే నవ్వుతావేమో!" అన్నాడు శ్రీనివాసరావు నిష్కారణంగా సిగ్గుప డుతూ.

"నీకు తెలిసిందంతా నాకు తెలియకపోతే నేను వచ్చినందుకు ప్రయోజనం ఏముందీ? ఏదో కుక్కను చూపించి 'ఇది ఆదినారాయణ అని నమ్ము' అంటే, 'ఓహో! ఇదా పునర్జన్మ అంటే?' అని నేనెట్లా అనగలనూ?"



"ఒకసారి నేను ఈ ఆదినారాయణ శాస్త్రికి పన్నెండు వందలు బదులిచ్చాను. వాడా డబ్బు తీసుకుంటూ; 'నీ వాకిట్లో కుక్క అయి పడి ఉండి అయినా నీ రుణం తీర్చుకుంటాను, భాయి!' అన్నాడు. వాడా బాకీ తీర్చనేలేదు."

నాకిదంతా చాలా చాదస్తంగా కనప డ్డది.

"ఈ కుక్కపిల్ల పునర్జన్మ అనే దాన్ని గురించి శోధన చెయ్యాలంటే మనం ఇంత కంటే కొంచెం శాస్త్రీయమైన మార్గం తొక్కా లేమో!" అన్నాను.

శ్రీనివాసరావు నొచ్చుకున్నవాడల్లే, "నేనందుకనే చెప్పనన్నాను... అసలు నీకు ఈ కుక్క ఆదినారాయణ అయినా ఆకాశరా మన్న అయినా ఒకటే. దానికి మనిషికున్న జ్ఞానం ఉంది. దానికి మనం మాట్లాడేది స్పష్టంగా అర్థమౌతుంది. అది కిందటి జన్మలో మనిషి అని జ్ఞాపకం పెట్టుకుని మరీ ప్రవర్తించు. దాన్ని ఒకసారయిన చూడందే నీకు నీనెంత చెప్పినా నీ తలకె క్కదు. ఇదంతా ఇప్పుడెందుకు చెపుతున్నా నంటే, నువ్వు మా యిల్లు చేరిన తరవాత ఆ కుక్క వింటుండగా "అదీ, ఇదీ" అనటం గాని, ఇంకే విధంగానన్నా అవమానించ టంగాని చేస్తే దానికి అర్థమవుతుంది. వ్యవ హారం మొదట్లోనే బెడుస్తుంది. అందుకని ఇదంతా చెబుతున్నాను. కావాలంటే జాగ ర్తగా నువు కూడా గమనించే నే చెప్పిం దంతా నిజం అవునో కాదో తనిఖీ చెయ్యి!"

ఆ తరవాత బండి వాళ్ళ ఇంటిముందు ఆగేవరకూ వాడు కుక్కను గురించి ఏమీ మాట్లాడలేదు. బండి కుదుపు జాస్తిగా ఉండటం వల్ల క్రమంగా సంభాషించాలనే ఇచ్ఛ కూడా పోయింది నాకు.

''ఆదినారాయణ – అదే, ఈ కుక్కను గురించి నా భార్య దగ్గిర కూడా ఏమీ ప్రస్తావన తీసుకురాకు. ఆవిడకు ఈ కుక్క అంటే చెప్పతరంకాని మంట!'' అన్నాడు శ్రీనివాసరావు మేమిద్దరమూ ఇంట్లోకి పోతుండగా.

''ఏం? ఆవిడకు పునర్జన్మ విషయమై నమ్మకం లేదా?''

''అది కాదు. ఆవిడకింకా ఆ విషయం తెలియదు. తెలిస్తే దాన్ని చంపేస్తుంది కూడానూ! అది తన వంక మనిషి చూసినట్లు చూస్తుందని ఆవిడకు కోపం. అందుచేత కుక్కను నేను దొడ్లో పాకలో ఉంచుతున్నాను''.

తరువాత అయిదు నిమిషాలకు చూశానా కుక్కను. ఆ ప్రథమ దర్శనం నాకు చాలా నిరుత్సాహకరంగా ఉంది. ఎందువల్లనో నేను ఈ కుక్క అన్ని కుక్కలల్లేనూ ఉండదని భావించాను. బాగా ఆలోచిస్తే అటువంటి భావనకు ఏ మాత్రమూ ఆధారం కనపడదు. అయినా, ఇది సామాన్యమైన ఆడకుక్క కడుపున పుట్టిన కుక్కపిల్ల అని మాత్రం నేను ఊహించలేదు.

అది మొత్తం మీద నల్లకుక్క. మెడమీదినించి ముందు ఎడమకాలి సగం వరకూ వ్యాపించి ఒకటీ, ఎడమ కన్ను ప్రాంతాల ఒకటీ తెల్లమచ్చలున్నై. వెనక కాళ్ళ కింది భాగాలు మళ్ళా తెల్లగా ఉన్నై. చూడటానికా కుక్కపిల్ల అట్టే పుష్టిగా నైనా లేదు. దాని శరీరం మీది బొచ్చుకూడా పొట్టిగాను అనారోగ్యం గానూ ఉంది, ఏ మాత్రమూ నిగనిగలాడటం లేదు. ఇక అది మామూలు కుక్క కాదనుకోటానికి ఆధారం ఏమైనాఉంటే దానికళ్ళే. ఆ కళ్ళూ ఆ చూపు నేను ఏ కుక్కలోనూ చూడ లేదు. నేను దాన్ని సమీపించగానే అది నా వంక ''ఎవడు వీడు?'' అన్నట్లు ఒక విచిత్రమైన చూపు చూసింది. దాని మొహం మీద కళ్ళ పై భాగంలో మధ్యగా ఉండే చర్మం – మన కనుబొమ్మలు కలుసుకునే నుదుటి భాగానికి సరిపొయ్యేచోట – మడతలు పడ్డది. అంతా మనిషి కనుబొమ్మలు ముడేసినట్టే!

''ఇది అట్టే ఆరోగ్యంగా ఉన్నట్టు కనపడదేంరా?'' అన్నాను.

శ్రీనివాసరావు నా చెయ్యిగిల్లి రహస్యంగా ''ఇది అనకు!'' అన్నాడు. నాకు మండిపోయింది. ఈ వెధవ కుక్క – కిందటి జన్మలో మనిషి అవుగాక! ఎన్ని కుక్కలు కిందటి జన్మలో రాజాధిరాజులో! దీని కోసం నేను మర్యాదగా ప్రవర్తించాలా?

నేను కోపం గానే దానివంక తిరిగి, ''నా మాటలు నీకు అర్థం అవుతున్నయ్యా?'' అన్నాను. అది ముక్కులోనించి చప్పుడయ్యేటట్టు గాలి వదిలి పెదిమలు చప్పరించింది.

''నీ పేరు సుబ్బారావా?'' అన్నాను. కుక్క గుర్రుమన్నది.

''ఆదినారాయణా?'' అన్నాను, దాని మొహం జాగ్రత్తగా గమనిస్తూ. నమ్మండి నమ్మకపోండి ఆ కుక్క, మనిషి ఆడించినట్టు తలపైకీ కిందికీ ఆడించింది!

ప్రథమ దర్శనంలోనే దాన్ని చూస్తే నాకు దురభిప్రాయం కొంతకలిగి ఉండకపోతే ఆ తల ఆడించటం నాకు పూర్తి నమ్మకం కలిగించి ఉండవలసింది. అప్పటికీ నా ఆశ్చర్యానికీ మేరలేదు. నేను శ్రీనివాసరావు వంక చూశాను. వాడు నవ్వి కుక్క వంక తిరిగి, ''వాడింకా నమ్మలేకుండా ఉన్నాడు!'' అన్నాడు. వాడా మాటా అనగానే కుక్క నన్ను చూడటం మాని వాడి దగ్గిరికి వెళ్ళి వెనకకాళ్ళ మీద కూర్చుని నాలిక బయటికి చాచి, రోజూ నవ్వుతున్నదానల్లే వాడివంక చూడటం మొదలు పెట్టింది.

ఇంకొకడికైతే అప్పటికైనా నమ్మకం దృఢపడేదేమో కాని, అది నా ప్రారబ్ధమే అనండి, అది నాలిక బయటపెట్టి రొజటం మొదలు పెట్టగానే దానిమీద నాకు కలుగుతున్న విశ్వాసాం కాస్తాపోయింది.

తరవాత క్రమంగా నేనుకూడా నమ్మటం ప్రారంభించాననుకోండి! నమ్మకుండా ఉండటం సులభం కాదు. తెలుగులో ఏ పని చెప్పినా చేస్తుంది – కనీసం చెయ్యగలదు. కాని దానికి ఇష్టం లేని పనులు చెబితే చచ్చినా చెయ్యదు. పైగా గుర్రుమంటుంది. అంత కోపిష్టి ప్రాణిని నేనెక్కడా చూడలేదు. దాన్ని పరీక్ష చెయ్యటానికి ప్రయత్నిస్తున్నామని తెలిసినా మొండికెత్తుతుంది. దాని

## కథాంతరంగం



మా నాన్న కథల్లో నాకు నచ్చిన కథ ఎంపిక చెయ్యటం కష్టం. అందుకే ఆయనకి అన్నిటికన్నా ఉత్కృష్టమని అనిపించిన 'కాల భైరవుడు' కథని ఎంపిక చేశాను. ఇది మా నాన్న మొట్టమొదటి కథా సంపుటి, 'స్వగతం'(1937)లోనిది. ఈ కథ రాయటం అంత సులభం కాదని ఆయనే స్వయంగా చెప్పుకున్నారు. మతవారసత్వంగా సంక్రమించిన ఆదిమ లక్షణాలు మనిషి ప్రగతి సాధించటానికి ఎలా అడ్డుపడతాయో ఈ కథ నిరూపిస్తుంది. మా నాన్న కథల్లో ఎక్కువగా కనిపించే హాస్యం, వ్యంగ్యం ఈ కథలో కూడా ఎక్కువగా కనిపిస్తాయి. ఇరవై ఒకటో శతాబ్దానికి చేరుకుని, సాంకేతికంగా ఎంతో ప్రగతి సాధించి కూడా, బాబాలూ, పునర్జన్మలు, విగ్రహాలు పాలు తాగటాలు, కన్నీళ్ళు (ఒక్కోసారి రక్తాశ్రువులు) కార్చటాలు నమ్మే జనం ఇంకా ఉన్నందువల్ల ఈ కథ ఈనాటికీ నిత్య నూతనంగా ఉందనే అనాలి. అందుకే ఇది నాకెంతో ఇష్టమైన కథ.

–ఆర్ శాంతాసుందరి

పెడకట్టెతనం వల్ల నాకు దానియందు గురి కుదరటం మొదట్లో కొంచెం కష్టమయింది. కాని ఆఖరుకు నమ్మాను. అది ఆదినారాయణ పేర పిలిస్తేనే వినిపించుకుంటుంది. అంతవరకు నేను రుజువివ్వగలను – అయినా ఏ ఆదినారాయణో చెప్పలేం. పైగా ఆదినారాయణ అనే పేరు దానికి మావాడే అలవాటు చేసి ఉండినా ఆశ్చర్యం లేదు. అది నిజంగా కిందటి జన్మలో మనిషే అయి ఉంటుందా లేక మనిషి ఆత్మ అయినా వచ్చి ఈ కుక్క శరీరాన్ని ఆవేశించిందా అన్న సూక్ష్మ విచారణ కూడా నాకు అవసరం లేదు. నా ప్రాణానికి రెండూ ఒకటే. దానికి మనిషికున్నంత జ్ఞానం ఉంది. ఆ జ్ఞానం దీనికి పుట్టిన తరవాత కలిగా ఉండటం అసంభవం. అది రెండు మూడు నెలలు దాటని పిల్ల!

కానీ నేను చెప్పదగినదీ మీరు వినదగినది ఏమిటంటే నాకు కుక్క మీద నమ్మకం కుదిరినా మా శ్రీనివాసరావుకు కుదిరినట్టు భక్తి కుదరలేదు. అది సామాన్యపు కుక్క కాకపోవచ్చు కాని సామాన్యపు మనిషికంటె ఎక్కువ మాత్రం కాదు. కిందటి జన్మలో అది ఎవరోకాని, ఆ మనిషితో నాకు పరిచయం ఉంటే అతనికీ నాకూ స్నేహం అయి ఉండదు. ఈ కుక్కకూ నాకూ ఒక్క రవ్వయినా మనస్సులు కలవలేదు. ఆ కుక్క అతిశయమూ అహంకారమూ నేను సహించలేక పొయ్యేవాణ్ణి. దానికి మనిషికున్న జ్ఞానం ఉందని మాకు తెలుసునని దానికి తెలుసును. తన్ను మేమిద్దరమూ నెత్తిన పెట్టుకు ఊరేగించకపోతే దానికి కోపం. దాని ''వానిటీ'' మావాడు తృప్తిపరిచేవాడు. నేను దాన్ని నిర్లక్ష్యంగా చూసేవాణ్ణి. పైగా దాని ''ఇన్ఫీరియాటీ కాంప్లెక్సు'' నేను అసలే సహించలేక పొయ్యేవాణ్ణి. దాన్ని గౌరవించనప్పుడల్లా అగౌరవంగా చూస్తున్నారనే! నేను మా సంభాషణలో దాన్ని కూడా చేర్చకపోతే మండిపడేది – తన మంట అనేక విధాల చూపించేది.

మా వాడికి కూడా నా ప్రవర్తన రుచించలేదు. ''ఏమిట్రా నీకీ కుక్కలో ఇంకా నమ్మకం కుదరలేదా – లేకపోతే ఏమిటి? దీన్ని డిస్కవర్ చేసినప్పటినుంచీ నాకు పెన్నిధి దొరికినట్టుంది. ఇటువంటి ఫినామినన్ – ఇంత విచిత్రం! నీ కళ్ళారా చూసికూడా చలించవే! నీకేమీ ఆశ్చర్యంగా లేదా?'' అన్నాడు వాడు.

''ఆశ్చర్యం! విపరీతమైన ఆశ్చర్యంగా ఉంది. ఇది చూసినప్పటినించీ, ఇటువంటి చిత్రాలన్నిటికీ కారణభూతమయిన శక్తిని గురించి నా అభిప్రాయం మరింత భక్తితో కూడుకున్నదయింది. ఆ భక్తి ఈ చీడ కుక్కమీద చూపించమంటే నా చాతకాదు. కావాలంటే ఇతర కుక్కలను దీనియందు భక్తితో సంచరించమను. నాకేమిటి? మనిషిగా మెచ్చుకోలేని వ్యక్తిని కుక్కగా ఎట్లా మెచ్చుకోమంటావు?'' అన్నాను.

''నీలో నిజమైన శోధనోద్రేకం – రిసెర్చి స్పిరిటు – లేదుపో!'' అన్నాడు

మావాడు. నేను అప్పుడే చూపించిన నిర్లక్ష్యం తరవాత క్రమంగా లోకమంతా చూపించిన సంగతి మావాడు గుర్తించే ఉంటాడనుకుంటాను!....

అవును, తరవాత కొద్ది రోజులకే ఈ కుక్క మావాడి సొత్తు కావటం మాని లోకం సొత్తయింది.

నేను ఆ నాలుగు రోజులూ కోడూరులో ఉండి, సోమవారం చీకటితో లేచి స్కూలుకు అందుకున్నాను. మళ్ళీ శుక్రవారం సాయంకాలం రమ్మని శ్రీనివాస రావు నన్ను మరీ మరీ అడిగాడు. ఈ లోపల కొంత ''మెమెరాండా'' కూడా తయారు చేస్తానన్నాడు ''ఆదినారాయణ''ను గురించి.

శ్రీనివాసరావు ఒకటి తలిస్తే లోకం ఇంకొకటి తలిచింది. గురువారం నాడే కోడూరు వితంతువులు ఇద్దరూ ముగ్గురూ ఒక తరంగాలు పాడే ఆయనా కలిసి ''ఆదినారాయణ'' కాలభైరవుడని కనిపెట్టారు!...

ఆ ఊళ్ళో ఒకచోట రోజూ సాయంకాలం పూట భజన జరుగుతూ ఉంటుంది. ఒకనాడు ''ఆదినారాయణ'' అక్కడికి వెళ్ళి భజన వింటున్నది. భజనచేసే వాళ్ళలో కొందరు కొట్టబోతే గుర్రుమన్నది. ఆ తరంగాలు పాడే ఆయన – తన కొంపలో రోజూ కుర్రవాళ్ళను కొడుతూనే ఉంటాడు – ఆ కుక్కకు చేతులెత్తి నమస్కారం చేసి ''ఆ శ్రీమన్నారాయణ మూర్తే ఇట్లా వచ్చి వింటున్నాడు మన స్తోత్రాన్ని! ఉండనివ్వండి'' అన్నాడు.

మరుక్షణమే ''ఆదినా꞉రాయణ'' మంచి ఉపాయం ఆలోచించింది. అది వెంటనే వెళ్ళి దేవుడి పటం ముందు కూర్చుని భజనచేసే వాళ్ళవంక ''ఇక మీ పని మీరు చెయ్యండి!'' అన్నట్టు చూసింది.


చిత్రం ఏమిటంటే అందులో ఒక వితంతువుకు ఆ కిందటి రాత్రే శ్రీమన్నారాయణుడు కుక్క స్వరూపంతో కనిపించి ''నేను వస్తున్నాను, మీ భజన మందిరం పావనం చేస్తున్నాను'' అన్నాడట. ఆవిడ ఒక్కత్తెకే అటువంటి కల వచ్చి ఉంటే ఆటే నమ్మదగిన విషయంగా ఉండి ఉండేది కాదేమో కానీ ఇంకో వితంతువుకు కూడా అటువంటి కలే రావటం వల్ల మొదటి ఆవిడ కల అబద్ధం అయి ఉండటం అసంభవమయింది... అయితే రెండో విధవ కలలో కనిపించింది, శ్రీమన్నారాయణుడు కాడు, వెంకటేశ్వరస్వామి – నామాలూ, కాళ్ళదాక ఉత్తరీయమూ, బారెడు బారెడు రేకు చెప్పులూ! నల్లటి విగ్రహం; ఆ తెల్లటి నామం కాస్త ఎడమ కంటిమీదికి ఉన్నట్టూ, తెల్లటి ఉత్తరీయం కుడి భుజం మీద స్పష్టంగా కనిపించినట్టూ, పాదాలు వెండి పాదాలయినట్టూ ఆ రెండో విధవకు స్పష్టంగా కళ్ళకు కట్టినట్టయింది!....

తరవాత కథ నేను చెప్పనక్కర్లేదు, మా ప్రాంతాల అందరికీ తెలుసు. ఈ కాలభైరవస్వామి రాకతో కోడూరు పురవాసులు నాగుమయ్యను కూడా మరిచారు. స్వామివారు ఆ రోజు కా రోజు గడిచినకొద్దీ అనేక వేలమందికి కలల్లో సాక్షాత్కరించి కోరిన కోరికలు తీర్చసాగారు. అనేక వేల మంది సంతానం లేనివారు స్వామివారి అనుగ్రహం వల్ల సంతానం కన్నారు. అట్లా కన్న స్త్రీని ఒకామెను నేను స్వయంగా ఎరుగుదును. ఆవిడకు సంతులేని మాటా తరువాత కలిగిన మాటా నిజమే కాని, ఆవిడ స్వామివారిని దర్శించి వచ్చిన తరువాత ఏడు నెలలకే కలిగాడు శిశువు!....

భజన మందిరం పూజా మందిరంగా మారింది. రోజూ స్వామివారి సాన్నిధ్యంలో వేద పఠనమూ, స్వామికి షోడశ పూజలూ, ఇంకా ఏమిటో, రాత్రి కాగానే అక్కడే స్వామి శయ్యా! చక్కని మంచం మీద బూరుగ దూది పరుపు పరిచి తెల్లని ఇస్త్రీ మడతలు పరిస్తేనే కాని స్వామి వారు పడుకోరు, అచ్చ శాకాహారం తప్ప ముట్టరు. ఉదయం పూట కాఫీ ఉప్మాలు సేవిస్తారు..

ఈ విధంగా ఆరు నెలలు జయప్రదంగా వెళ్ళింది. అకస్మాత్తుగా కాలభైరవుడి ప్రశంస అందరూ మానేశారు.

భగవంతుడైనా సరే మనిషి జన్మ ఎత్తితే మనిషి యొక్క శరీరతత్వమూ మనస్తత్వమూ గుర్తించి తీరాలి. అక్కడ ప్రకృతికి భిన్నంగా వెళ్ళితే ప్రమాదం ఉంది. ఈ కుక్కకు అంత వివేకం లేక పోయింది. తనకు అందుబాటులో ఉండే నియమాలు అవలంభించక అది ఆశకుపోయి, మనిషి మెప్పుకోరి, మనిషి నియమాలు అవలంబించటం వల్ల దానికి ఒక విధమైన రుగ్మత ప్రారంభమైంది. దాని శరీర తత్వానికి అనుగుణ్యమైన ఆహారం పడలేదు. ఒకసారి తన సహజ



మైన ఆహారాన్ని చూసిన తరవాత దీనికీ పూజలూ, పురస్కారాలూ, లోకం తనకు ఆరోపించిన కాలభైరవత్వమూ మొదలైన వాటిమీద విముఖత్వం బయలుదేరింది. చేజేతులా ఈ పీడ తెచ్చిపెట్టుకున్నందుకు దానికి చాలా పశ్చాత్తాపం కలిగి ఉండాలి. తనను పరివేష్టించుకుని ఉండే భక్త సముదాయం మీద దానికి ఆగ్రహం జాస్తి అయింది. వాళ్ళు తన్ను ఒక క్షణం ఏమరి ఉండరు. అర్ధరాత్రివేళ తను చడీ చప్పుడూ లేకుండా బయటికి పోతున్నా ఎవడో ఒక భక్తుడు, హాయిగా నిద్రపోతూ ఉండవలిసిన వెధవ, తలెత్తి ''స్వామీ, ఎక్కడికి?'' అని తోడు వస్తాడు.

తన చేతులారా ఇదంతా తెచ్చిపెట్టుకున్న మాట కూడా మరిచిపోయి, తనను భక్తులంతా నిర్బంధిస్తున్నారన్న భావం కూడా దానికి కలగటం నేను సులభంగా ఊహించగలను. ఆఖరుకు అది ప్రతి వాళ్ళమీదా గుర్రుమనసాగింది.

కాలభైరవుడి మనసు సరిగాలేదని అందరూ గ్రహించారు. స్వామికి ఆగ్రహం వచ్చిందన్నారు. దానిచుట్టూ ఇరవై నాలుగు గంటలూ భజనలూ, ఊరంతా సంతర్పణలూ ప్రారంభించారు. ఆ కుక్కకు పూర్తిగా వెర్రెత్తిపోయింది. కాలభైరవుడు తన అత్యంత ప్రియశిష్యుడైన తరంగాలు పాడే పెద్ద మనిషి పిక్క పట్టుకుని కండ ఊడేటట్టు పీకిందన్న వార్త దశదిశలా వ్యాపించింది.

మర్నాడే కాలభైరవుడు అదృశ్యమైనాడు! కొంతకాలం నించీ స్వామివారు భక్తులపైన ఆగ్రహంగా ఉండటమూ, ఆఖరుకు అదృశ్యుడు కావటమూ చూసి ఏదో మహాపచారం జరిగిందని గ్రహించి, భక్తులంతా ఒకరినొకరు అనుమానించసాగారు. భక్తులలో అంతః కలహాలు బయలుదేరి బహిః కలహాలు, తిట్టుకోటాలూ, కొట్టుకోటాలుగా పరిణమించినై.

తరవాత కొన్ని రోజులకు చేబ్రోలు గ్రామంలో ఒక బలిసిన, నల్లగా నిగనిగలాడే మరొక ఆడ కుక్క వెంట పోతూండటం చూచి ఒక పెద్దమనిషి నిర్ఘాంతపోయి నిలబడ్డాడు. కొంతకాలం కిందట ఆయన కోడూరు వెళ్ళి కాలభైరవుణ్ణి సందర్శించి వచ్చాడు. ఈ కుక్క అచ్చంగా ఆ కాలభైరవుడికి అన్నో తమ్ముడో అన్నట్టుంది. కాలభైరవుడు అదృశ్యమై అప్పటికి వారం రోజులయిందని ఆయన భార్య చెప్పి ఉండకపోతే ఆయనకు ఈ కుక్కే కాలభైరవుడా అన్న సందేహం కలిగి ఉండవలసిందే!....

తరవాత తరవాత క్రమంగా చాలా విషయాలు బయట పడినై. మధ్య మధ్య ఈ కుక్క ఎంగిలి విస్తరాకులు నాకటమూ, బొమికలు కొరికి చూడటమూ చూసిన వాళ్ళున్నారు. తన వంట ఇంట్లో ప్రవేశించి అన్నపు కరుడు ఎత్తుకు పోతుంటే ఒక ఇల్లాలు చేతిలో ఉన్న కట్టెపేడు విసిరేసిన తరవాత కాలభైరవుణ్ణి గుర్తించి అపరాధమని చెంపలు వాయించుకుని ఇదంతా రహస్యంగా దాచిపెట్టింది. కాలభైరవుడు అంతర్ధానం అయిన తరవాత క్రమంగా ఈ కథలన్నీ ప్రచారంలోకి వచ్చినై....

మొన్న ఈ మధ్యనే శ్రీనివాసరావు మళ్ళా నాకు కనిపించాడు. వాడి దగ్గిర ఈ సంగతి తెస్తే. ''ఛా! ఆ వెధవ కుక్క సంగతి యెత్తకు! దీనికోసం ఒక రాత్రల్లా వెతికి మర్నాడు ఉదయం భజన మందిరంలో ఉందని విని చూడబోయినాను. నన్ను చూడగానే బొయిమని మీదికి వచ్చింది. ఆ తరంగాలు పాడే పీనుగ – వాడికీ నాకూ పడదు, అదంతా చాలా కథ ఉందిలే! – నేను వినేట్టు 'స్వామివారికి భక్తులెవరో, పతితులెవరో తెలుసు!'' అన్నాడు... మొత్తానికి మంచి ఎత్తే వేసింది. దాని బతుకు నాకు తెలుసనని దానికి తెలుసు – వెధవకు!' అన్నాడు.

దానికి భగవంతుడు ప్రసాదించిన శక్తిని అది వృథా చెయ్యకుండా, ఆ శక్తిని కుక్కల జాతియెక్క మేలుకే ఉపయోగించితే ఆ జాతికి చాలా మేలు చేసినదయ్యేదనుకుంటాను ఈ ''ఆదినారాయణ''!

★

*(మొదటి ముద్రణ: స్వగతం కథల సంపుటి, ఆగస్ట్ 1937 యువ కార్యాలయం, తెనాలి)*

**కథాకళి**



# గాలివాటం బతుకులు

అది వెయ్యేళ్ళ కిందటి సమయం. బంగాళాఖాతం సముద్ర తీరం. ఆ తీరంలో అనేక గద్దల గుంపులు.

బంగాళాఖాతంలో తరచూ తుపాన్లు వచ్చేవి. భయంకరమైన హోరు. భరించలేనంత వేగం. సుడులు తిరుగుతూ రువ్వడిగా వచ్చే గాలి గందరగోళం చేసేది.

పాపం... ఆహారం కోసం బయల్దేరిన గద్దల గుంపులు, అకస్మాత్తుగా వచ్చే ఆ తుపానులో చిక్కుకుపోయేవి. అసలే బరువుగా ఉండే ఒక్కో గద్ద విలయ తాండవం చేసే తుపాను గాలి మధ్యలో ఇరుక్కుని, రువ్వడిగా తిరిగి, రెక్కలు విరిగి, రక్తం కక్కుకుని కిందపడి చనిపోయేవి.

అప్పుడప్పుడే ఎత్తుకు ఎగరడం నేర్చుకున్న భేరుండ్ అనే పిల్ల గద్ద దీన్ని గమనించింది. ఆ ఉత్పాతానికి పరిష్కారమే లేదా, తమ జాతి సమస్యకు విరుగుడే లేదా అని ఆలోచించింది. చిన్న చిన్న తుపానులు వచ్చినపుడు ఏం జరుగుతోందో నిశితంగా గమనించింది. తుపాను గాలి ఎటు తిరుగుతుందో, ఎం చేస్తుందో, ఎలా పైకి వెళుతుందో, ఎలా కిందకు వస్తుందో అది తెలుసుకుంది. చివరికి అది ఒక అద్భుతమైన విద్యను సాధించింది.

ఒకసారి భారీ తుపాను వచ్చింది. మిగతా గద్దలన్నీ భయపడి దేని చెట్టు మీద అవి ఉండిపోయాయి. భేరుండ్ మాత్రం ధైర్యంగా ఆ తుపాను గాలిలోకి ప్రవేశించింది. తన పొడవాటి రెక్కలను అలా చాచి, ఓడ తెరచాపను మార్చినట్టు దిశను మారుస్తూ, వేగంగా పైకి లేస్తున్న గాలి వాలుకు అనుకూలంగా పెట్టింది. దీంతో తుపాను గాలితో పాటే అది కూడా ఎంతో ఎత్తుకు ఎగిరిపోయింది. తుపాను ప్రభావానికి పైకి చేరిపోయింది. తుపాను తగ్గుతున్నట్టు తెలియగానే మళ్ళీ కిందకు జారుతున్న గాలికి అనుకూలంగా రెక్కల్ని కాస్త ముడిచి, కాస్త తెరిచి, ఆ గాలితో పాటే కిందకు దిగింది.

తుపాను గాలిలోంచి క్షేమంగా దిగిన భేరుండ్‌ను చూసి మిగతా గద్దలు ఆశ్చర్యపోయాయి.

ఏం మాయ చేశావ్? ఏం మహిమ సాధించావ్? తుపానులోకి వెళ్ళి ఎలా బయటపడ్డావ్? ప్రశ్నించాయి మిగతా గద్దలు!

గాలి విద్యతో ఇదంతా సాధ్యమైంది చెప్పింది భేరుండ్.

**నీతి:** ఈ ప్రపంచం ఒక సముద్రం. అందులో జీవన యానం తుపానుతో సమానం. నిత్యం ఎదురయ్యే సమస్యలు ప్రచండ వేగంతో వీచే తుపాను గాలులు. వాటికి ఎదురొడ్డి నిలవాలంటే ఆ గాలికి ఎదురీదడం ఎంత మాత్రం సరికాదు. ఆ సమస్యలనే ఆలంబనగా చేసుకుని మరింత పైకి ఎగరగలగాలి. ఆ సమస్యల ప్రభావం మనలను తాకనంత ఎత్తుకు ఎదగాలి. సమస్యతో ఢీకొట్టకుండా చివరికి ఆ సమస్యనే మనకు పరిష్కారంగా మలచుకునే విద్యను సాధించాలి. జీవితమనే తుపానులో ఏ వ్యక్తినైనా కూల్చేది సమస్యల బరువు కాదు; వాటిని పరిష్కరించలేని వైఫల్యం మాత్రమే. మన జీవితమే గాలివాటం కదా!

**– తిగుళ్ళ కృష్ణమూర్తి**